క్లుప్తంగా

చందాల కౌంటర్లు ఏర్పాటు



సుభాష్‌నగర్: నగరంలోని మార్వాడిగల్లీలో గల తన నివాసంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ వినాయక మండపాలకు చందాల కోసం గురువారం ప్రత్యేకంగా మూడు కౌంటర్లు ఏర్పాటు చేశారు. ధన్‌పాల్ లక్ష్మీబాయి విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కౌంటర్లు ఏర్పాటు చేసి అర్బన్ నియోజకవర్గంలోని మండపాలకు చందాలు రాశారు. 240 మండపాలకు చేయూత అందించారు. శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంటకు కూడా అందుబాటులో ఉంటానని, మండపాల నిర్వాహకులు రావాలని కోరారు. చందాల కోసం కౌంటర్లు ఏర్పాటు చేశారని తెలియడంతో పెద్ద ఎత్తున నిర్వాహకులు తరలివచ్చారు.

కలుషిత ఆహారంతోనే విద్యార్థులకు అస్వస్థత



సుభాష్‌నగర్: భీమ్‌గల్‌లోని కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సభ్యులు పేర్కొన్నారు. ఈమేరకు గురువారం పాఠశాలను పరిశీలించి, అక్కడ నెలకొన్న సమస్యలను కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కేజీబీవీకి ప్రహరీ లేకపోవడంతో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని, పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయన్నారు. గురుకులం పక్కనే మున్సిపాలిటీ డంపింగ్‌యార్డు ఉందని, వెంటనే పాఠశాలనైనా.. డంపింగ్ యార్డునైనా అక్కడి నుంచి తరలించాలని కోరారు. నాసిరకమైన వంట సామగ్రి గుర్తించామని, వెంటనే సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. సంస్థ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజశేఖర్, ప్రతినిధులు బాల లింగం, మహేందర్ గౌడ్, సాయన్న, రమేష్, సురేష్ పాల్గొన్నారు.

ఆత్మహత్యల నివారణపై అవగాహన



డిచ్‌పల్లి: అనవసరమైన విషయాలను ఆలోచిస్తూ, ఆత్మన్యూనత భావానికి గురికావొద్దని పల్లె దవాఖానా ఎంఎల్‌హెచ్‌పీ గంగభవాని సూచించారు. గురువారం డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్ గ్రామ పంచాయతీలో ఆరోగ్య మేళా (ఆత్మహత్యల నివారణ అవగాహన కార్యక్రమం) నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. అనవసరంగా ఆలోచించొద్దని, ఒంటరిగా ఉండకుండా ఎప్పుడూ పదిమందిలో మాట్లాడుతూ ఉంటే ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన రాదని చెప్పారు. హైపర్ టెన్షన్, డయాబెటిక్ వ్యాధిగ్రస్తులు సమయపాలన పాటిస్తూ సరైన ఆహారాన్ని తీసుకోవాలని, వ్యాయామం చేయాలని సూచించారు. ఏఎన్‌ఎంలు గొల్లపల్లి శైలజ, రజిత, ఆశాకార్యకర్తలు వనిత, అరుణ, సరిత పాల్గొన్నారు.

చట్టసభలో ముదిరాజ్‌లకు అవకాశం కల్పించాలి

నిజామాబాద్‌నాగారం: చట్టసభలో ముదిరాజ్‌లకు అవకాశం కల్పించాలని తెలంగాణ ముదిరాజ్ మహా సభ రాష్ట్ర అధ్యక్షుడు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండప్రకాష్‌కు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విన్నవించారు. గురువారం హైదరాబాద్‌లో ఆయనను జిల్లా ముదిరాజ్‌లు కలిశారు. ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు మెతుకు శివకుమార్, కామారెడ్డి గ్రంథాలయ చైర్మన్ రాజేశ్వర్ ముదిరాజ్, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు బిక్షపతి ముదిరాజ్ పాల్గొన్నారు.

‘అంబేడ్కర్’ నాటక ప్రదర్శన

నిజామాబాద్‌అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రకు సంబంధించి సంగం శరణం గచ్ఛామి నాటకాన్ని జిల్లాలో డివిజన్ల వారీగా ప్రదర్శిస్తున్నట్లు ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి శశికళ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16న ఆర్మూర్ క్షత్రియ ఫంక్షన్ హాల్‌లో, 19న బోధన్ అప్నా ఫంక్షన్ హాల్‌లో, 20న నిజామాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో ప్రదర్శన నిర్వహిస్తామని తెలిపారు.

ఒకరి అదృశ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని ఖలీల్‌వాడిలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చిన వ్యక్తి అదృశ్యమైనట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డికి చెందిన బేగరి సాయిలు(25) చికిత్స కోసం ఆస్పత్రికి తీసుకొచ్చారు. చికిత్స చేస్తున్న సమయంలో సాయిలు మూత్రం కోసం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఈ మేరకు భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

కేసీఆర్‌ను ఇంటికి పంపడం ఖాయం

సుభాష్‌నగర్: తొమ్మిదిన్నరేళ్లుగా ప్రజలను మోసం చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్‌ను వచ్చే ఎన్నికల్లో ఇంటికి పంపడం ఖాయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అరెస్టును నిరసిస్తూ గురువారం నగరంలోని నిఖిల్‌సాయి చౌరస్తాలో బీజేపీ అర్బన్‌శాఖ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ధన్‌పాల్ మాట్లాడుతూ ఇంటికో ఉద్యోగం ఇస్తామన్న సీఎం కేసీఆర్.. నోటిఫికేషన్ల ద్వారా ప్రభుత్వశాఖల్లో ఖాళీలను భర్తీ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని విమర్శించారు. 2018 ఎన్నికల మేనిఫెస్టోలో నిరుద్యోగభృతి ఇస్తానని మాట తప్పారని, నోటిఫికేషన్లు, ప్రశ్నాపత్రాల లీకేజీలతో నిరుద్యోగులను ఆర్థికంగా దెబ్బతీశారని విమర్శించారు. ఇదేవిషయంలో కిషన్‌రెడ్డి 24 గంటలు నిరాహార దీక్ష చేపడితే ప్రభుత్వం నియంతృత్వంగా వ్యవహరిస్తూ దౌర్జన్యంగా దీక్షను భగ్నం చేసిందని ఆరోపించారు. నాయకులు, కార్పొరేటర్లు, మోర్చాల ప్రతినిధులు పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, నాగోళ్ల లక్ష్మీనారాయణ, స్వామి యాదవ్, నారాయణ యాదవ్, రోషన్, మాస్టర్ శంకర్, వినోద్‌రెడ్డి, ఇప్పకాయల కిషోర్, వినోద్, హరీష్‌రెడ్డి, బాలకృష్ణ పాల్గొన్నారు.



నిజామాబాద్ నగరంలో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

జక్రాన్‌పల్లి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అరెస్టును నిరసిస్తూ జక్రాన్‌పల్లిలో గురువారం బీజేపీ నాయకులు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. శ్రీనివాస్‌గౌడ్, కిషన్‌నాయక్, కొప్పు రాజేందర్, దినేష్, కుంట శ్రీనివాస్, దత్తుగౌడ్ పాల్గొన్నారు.

ధర్పల్లి: ధర్పల్లిలో నిర్వహించిన దిష్టిబొమ్మ దహనంలో నాయకులు మహిపాల్, గంగారెడ్డి, గంగదాసు, నవీన్ గౌడ్ పాల్గొన్నారు.

సిరికొండ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అరెస్టును నిరసిస్తు మండల కేంద్రంలో బీజేపీ నాయకులు గురువారం నిరసన తెలిపారు. రాజేశ్వర్‌రెడ్డి, రామస్వామి, రంజిత్‌రెడ్డి, శ్రీనివాస్, సతీష్, బాబురావు, సంజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇందల్వాయి: నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఇందల్వాయిలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు.





జక్రాన్‌పల్లిలో సీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు, ధర్పల్లిలో..



ఇందల్వాయిలో..

ఘనంగా హిందీ భాషా దినోత్సవం



తెయూలో మాట్లాడుతున్న డాక్టర్ అబ్దుల్ ఖవి



ఎన్‌వైకే ఆధ్వర్యంలో కవి సమ్మేళనం

నిజామాబాద్‌నాగారం: హిందీ భాష మాత్రమే కాదని భారతీయుల అంతరాత్మ వంటిదని జిల్లా యువజన అధికారి శైలి బెల్లాల్ పేర్కొన్నారు. గురువారం నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో హిందీ భాషా దినోత్సవం సందర్భంగా హిందీ కవి సమ్మేళనం నిర్వహించారు. ఆదాయ పన్ను శాఖ అధికారి బిరాజా శంకర్ పాల్గొని అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో హిందీ భాషలోనే మాట్లాడలన్నారు. సీనియర్ హిందీ కవి సీతారాం పాండే, శ్రీమన్నారాయణ విరాట్ తదితరులు పాల్గొన్నారు.

తెయూలో..

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ హిందీ విభాగం ఆధ్వర్యంలో గురువారం హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉర్దూ బీవోఎస్ చైర్మన్ డాక్టర్ అబ్దుల్ ఖవి మాట్లాడుతూ.. దేశంలోనే హిందీ భాష గొప్పదని, స్వాతంత్ర్య పోరాటంలో హిందీ ముఖ్య భూమిక పోషించిందన్నారు. హిందీ విభాగం అధ్యక్షుడు డాక్టర్ జమీల్ అహ్మద్ మాట్లాడుతూ.. హిందీలో పాటలను విని అన్ని ప్రాంతాల నిరక్షరాస్యులు ఆనందిస్తారని చెప్పారు. కార్యక్రమంలో హిందీ బీవోఎస్ చైర్మన్ డాక్టర్ పార్వతి, పార్ట్ టైం అధ్యాపకులు తాహెర్, అశోక్ చౌహన్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: మండల కేంద్రంలో జెడ్పీహెచ్‌ఎస్‌లో, కిడ్స్‌పార్క్ పాఠశాలలో హిందీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం సతీష్‌కుమార్, గంగాధర్, మోతీలాల్, అన్నపూర్ణ, జమున పాల్గొన్నారు.

కేజీబీవీల తనిఖీ



మోపాల్: కేజీబీవీల పరిసరాలతోపాటు గదులు, భోజనశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కాంప్లెక్స్ హెచ్‌ఎం వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీని ఆయన తనిఖీ చేశారు. సరిపడా గదులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నాణ్యమైన కూరగాయలు, భోజనం అందించాలని, నాసిరకం సరుకులు ఉంటే తన దృష్టికి తేవాలని ఎస్‌వో శ్రీవేణికి సూచించారు.

సిరికొండ: మండలంలోని సర్పల్లి తండా జీపీ శివారులో ఉన్న కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఎంపీడీవో లక్ష్మీప్రసాద్ గురువారం తనిఖీ చేశారు. పాఠశాలలో గదులను, మరుగుదొడ్లను, ఆవరణను, భోజనాన్ని ఆయన పరిశీలించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఆయన హెచ్‌ఎం పర్వీన్‌బేగంకు సూచించారు.

16న బొజ్జాతారకం వర్ధంతి సభ

ఖలీల్‌వాడి: బొజ్జాతారకం వర్ధంతి సభను ఈ నెల 16న నిర్వహిస్తున్నట్లు బుద్దిష్టు సొసైటీ జిల్లా అధ్యక్షుడు అశోక్ అన్నారు. గురువారం మాల మహానాడు, ఏఐకేఎంఎస్, బుద్దిష్టు సొసైటీ ఆధ్వర్యంలో ఎన్‌ఆర్ భవన్‌లో సమావేశం నిర్వహించారు. దళిత నేత ప్రజా న్యాయవాది బొజ్జాతారకం వర్ధంతి సభను శనివారం నగరంలోని న్యూ అంబేడ్కర్ భవన్‌లో నిర్వహిస్తున్నామని, సభను విజయవంతం చేయాలని కోరారు. ఆకుల పాపయ్య, ధనరాజ్, బట్టి గంగాధర్, వేల్పూర్ భూమయ్య, వినయ్ కుమార్, నారాయణ, రామచందర్, శివకుమార్, బాలస్వామి, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

డిచ్‌పల్లి: పౌష్టికాహారం తీసుకుని వ్యక్తిగత పరిశుభ్రతను పాటించినట్లయితే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని నిజామాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అంజన తెలిపారు. గురువారం డిచ్‌పల్లి మండలం యానంపల్లి జెడ్పీహైస్కూల్‌లో వైద్యారోగ్య శాఖ, సూర్య ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులు, గ్రామంలోని మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు, కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలు అందజేశారు. వ్యక్తిగత పరిశుభ్రతపై జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ స్వామి సులోచన అవగాహన కల్పించారు. సూర్య ఆరోగ్య సంస్థ ప్రతినిధులు, వైద్య సిబ్బంది రాజేంద్ర కుమార్, విక్రమ్, వినోద్, ప్రశాంత్, అప్తమాలిక్ ఆఫీసర్ శ్రీకాంత్, సర్పంచ్ గోపు చిన్నుబాయి గంగాధర్, ఎస్‌ఎంసీ చైర్మన్ గణేష్, హెల్త్ ఎడ్యుకేటర్ శంకర్ పాల్గొన్నారు.



విద్యార్థికి అద్దాలు అందజేస్తున్న దృశ్యం

పండ్ల తోటల పెంపకంపై అవగాహన

ధర్పల్లి: పండ్ల తోటల పెంపకంపై ధర్పల్లి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో లక్ష్మణ్ మాట్లాడుతు పండ్ల తోటల పెంపకం రైతులకు లాభదాయకంగా ఉంటుందన్నారు. హార్టికల్చర్ ఆఫీసర్ సంధ్య, ఏపీవో, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సిరికొండ: పండ్ల తోటల పెంపకం వైపు రైతులను ప్రోత్సహించాలని ఎంపీడీవో లక్ష్మీప్రసాద్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పండ్ల తోటల పెంపకంపై పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు అవగాహన సమావేశం గురువారం నిర్వహించారు. ఏపీవో రాజశేఖర్, ఉద్యానవన శాఖ అధికారి సంధ్య పాల్గొన్నారు.



ధర్పల్లిలో మాట్లాడుతున్న ఎంపీడీవో లక్ష్మణ్

నిబంధనలకు విరుద్ధంగా పోస్టులు షిఫ్ట్ చేస్తున్నారు

నిజామాబాద్ అర్బన్: నిబంధనలకు విరుద్ధంగా స్కూల్ కో ఆర్డినేటర్ రవీందర్ పోస్టును షిఫ్ట్ చేస్తున్నారని గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కమ్మర్‌పల్లి మండలంలోని పోస్టును ఇతర మండలాలకు షిఫ్ట్ చేస్తున్నారని దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ధర్పల్లి: ధర్పల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఉత్తమ ఉపాధ్యాయులను గురువారం సన్మానించారు. మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 12 మందిని ఎంపీపీ నల్ల సారికహన్మంత్‌రెడ్డి సన్మానించారు. వైస్ ఎంపీపీ నవీన్‌రెడ్డి, ఉపాధ్యాయులు గోవర్ధన్‌రెడ్డి, వెంకటరాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరసన



నిజామాబాద్‌నాగారం/ఖలీల్‌వాడి: నిజామాబాద్ నగరంలోని సీడీపీవో కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ టీచర్ల సమ్మె కొనసాగుతోంది. సమ్మెలో భాగంగా గురువారం యూనియన్ జిల్లా కార్యదర్శి స్వర్ణ మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలన్నారు. అంగన్‌వాడీల సమ్మెకు ఐద్వా మహిళా సంఘం అధ్యక్షురాలు అనిత, కార్యదర్శి సుజాత మద్దతు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ కోసం దీక్ష

నిజామాబాద్‌నాగారం: ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా చౌక్‌లో గురువారం దీక్షలు చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు కనక ప్రమోద్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. శనిగారం మురళి కృష్ణ మాదిగ, మనికొల్ల గంగాధర్ మాదిగ, డల్ల సురేష్ మాదిగ, సరికెల పోషెట్టి మాదిగ, మంద ప్రభాకర్ మాదిగ, సూర్య అశోక్, ఖదీర్, పెద్దోళ్ల యమున మాదిగ, సుధ తదితరులు పాల్గొన్నారు.

అంజాగౌడ్ సేవలు మరువలేనివి



నిజామాబాద్‌నాగారం: సీనియర్ జర్నలిస్ట్ అంజాగౌడ్ ఐదో వర్ధంతిని గురువారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. అంజాగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్నేహ సొసైటీలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఐజేయూ జిల్లా అధ్యక్షుడు సంజీవ్ మాట్లాడుతూ అంజాగౌడ్ సేవలు మరువలేనివన్నారు. ప్రెస్ క్లబ్ సెక్రెటరీ రాజలింగం, సిరిగద ప్రసాద్, హైమద్ అలీ ఖాన్, దేవిదాస్, అంజాగౌడ్ కుమారుడు కిశోర్ గౌడ్ ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



సిరికొండ: మండలంలోని తూంపల్లి, కొండూర్ గ్రామాల్లో పలువురు బాధితులకు సీఎం సహాయ నిధి చెక్కులను బీఆర్‌ఎస్ నాయకులు గురువారం పంపిణీ చేశారు. సర్పంచ్ బాలమణిమల్లేష్, ఎంపీటీసీ లింగం, ఉపసర్పంచ్ నాగవ్వ, కొండూర్‌లో సురేందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇందల్వాయి: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 35 మంది లబ్ధిదారులకు మంజూరు అయిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రమేష్ బాధితులకు అందజేశారు. నాయకులు దాసు, కుమార్, రఘు పాల్గొన్నారు.

ఇంటి నుంచే భోజనం

- గుండారం పాఠశాలలో మధ్యాహ్న భోజనం బంద్
- ఇంటి నుంచి టిఫిన్ బాక్సులు తెచ్చుకుంటున్న విద్యార్థులు

నిజామాబాద్ రూరల్: మండలంలోని గుండారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం రెండు నెలలుగా నిలిచిపోయింది. ప్రధానోపాధ్యాయుడికి, మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సఖ్యత లేనందున విద్యార్థులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. గతంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు వండుతామని కమిట్మెంట్ తీసుకున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు. కానీ వారు మధ్యలోనే వదిలేసి మధ్యాహ్న భోజనం వండకుండా వెళ్లిపోయారని తెలిపారు. గ్రామ అభివృద్ధి కమిటీ, ఎస్‌ఎంసీ కమిటీ ఆధ్వర్యంలో దండోరా కూడా వేయించామని, అయినా భోజనం వండటానికి ఎవరు ముందుకు రావడం లేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. దీంతో విద్యార్థులు ఇంటి నుంచి టిఫిన్ బాక్స్‌లు తెచ్చుకుంటున్నారు. పాఠశాలలో మొత్తం 320 మంది విద్యార్థులు ఉన్నారు. కాగా బిల్లులు సక్రమంగా రావడం లేదని వండటం మానేసినట్లు మధ్యాహ్న భోజన కార్మికులు చెబుతున్నారు.



ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం తింటున్న విద్యార్థులు

సమస్యను పరిష్కరిస్తాం



గుండారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకులను తీసుకోవాలని హెచ్‌ఎంను ఆదేశించాం. మరోసారి మాట్లాడి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తా.

– దుర్గాప్రసాద్, డీఈవో

ఎస్సీ వర్గీకరణతోనే మాదిగల అభివృద్ధి

తెయూ(డిచ్‌పల్లి): ఎస్సీ వర్గీకరణ ద్వారానే మాదిగల అభివృద్ధి చెందుతారని ఎంఎస్‌ఎఫ్ స్టేట్ సెక్రెటరీ భైరపోగు శివకుమార్ మాదిగ అన్నారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించి గతంలో ఇచ్చిన హామీని బీజేపీ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ యూనివర్సిటీ అధ్యక్షుడు దినేష్ మాదిగ ఆధ్వర్యంలో గురువారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ మినీ సెమినార్ హాల్‌లో విద్యార్థి సంఘాల రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శివకుమార్ మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జరిగే ప్రతి కార్యక్రమానికి, సభలకు, సమావేశాలకు వచ్చి వర్గీకరణ మీద మాట ఇచ్చి బీజేపీ మోసం చేస్తుందని విమర్శించారు. కామారెడ్డి బీవీఎం అధ్యక్షుడు అర్బాజ్‌ఖాన్, తెయూ ఎస్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు శ్రీశైలం, ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్షుడు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శివకుమార్ మాదిగ

నిర్ధారణ పరీక్షలతో గుండెపోటు నుంచి తప్పించుకోవచ్చు

నిజామాబాద్‌నాగారం: బీపీ, షుగర్ ఉన్న వారికి ప్రస్తుత రోజుల్లో గుండె జబ్బులు రావడం సాధారణమైపోయిందని, అలాంటి వారు గుండె సంబంధిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం ద్వారా హార్ట్ ఎటాక్ బారిన పడకుండా తప్పించుకోవచ్చని సిగ్మా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి గుండె వైద్య నిపుణులు పృథ్వీ శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల గ్రౌండ్‌లో ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 200 మందికి ఈసీజీ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న సిగ్మా ఆస్పత్రి వైద్యులు

జాతీయస్థాయి బాక్సింగ్‌కు ఎంపిక



నిజామాబాద్‌నాగారం: ఈ నెల 15 నుంచి 17వరకు హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో జరిగే జాతీయ స్థాయి బాక్సింగ్ చాంపియన్‌షిప్‌కు గిరిరాజ్ కళాశాల విద్యార్థులు ఉమ, లావణ్య, జైల్‌సింగ్, బండునాయక్, హన్మాండ్లు ఎంపికయ్యారు. క్రీడాకారులను కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి, పీడీ బాలమణి అభినందించారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	60,700	వెండి (కిలో)	76,000
22 క్యారెట్స్	56,147	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	180
		లైవ్	160
స్కిన్‌లెస్	240	మటన్	750

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	5	10	గాజరుగడ్డ	40	60
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	30	50
బీరకాయ	30	50	దోసకాయ	25	50
దొండకాయ	25	50	ఆలుగడ్డ	20	40
బీర్నిసుకాయ	30	50	గోబిగడ్డ	18	40
కాకరకాయ	25	50	గోబిపువ్వు	25	50
వంకాయ	25	50	బీట్‌రూట్	35	60
పాలకూర	30	50	కరివేపాకు	40	60
మెంతికూర	30	50	చామగడ్డ	30	50
కొత్తిమీర	35	50	గోరుచిక్కుడు	40	60
పుదీనా	50	70	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	25	50			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

- స్క్రీన్-1 జవాన్(తెలుగు)- 10.30; మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి-1.35,7.25; మార్క్ ఆంటోని(తెలుగు)-4.30; చాంగులే బంగారురాజా (తెలుగు)-10.20
- స్క్రీన్-2 సుందర సుందరీమనులు-11.00; బిచ్చగాడు-1.20,10.25; జవాన్(తెలుగు)-4.20; మార్క్ ఆంటోని(తెలుగు)- 7.30
- స్క్రీన్-3 మార్క్ ఆంటోని(తెలుగు)-10.30; జవాన్(హిందీ)- 1.25,7.20,10.30; చాంగులే బంగారు రాజా -4.35

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

- స్క్రీన్-1 జవాన్(హిందీ)- 11.30,3.05,6.40, 10.15
- స్క్రీన్-2 చాంగులే బంగారురాజా-12.00; బిచ్చగాడు(తెలుగు)-2.50; జవాన్(తెలుగు)- 5.40; జవాన్(హిందీ)-9.15
- స్క్రీన్-3 రామన్న యూత్(తెలుగు)-12.50; మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి(తెలుగు)-3.35,10.10; ఖుషి(తెలుగు)- 6.45
- స్క్రీన్-4 మార్క్ ఆంటోని(తెలుగు)-10.25, 7.00; ది నన్-2(ఇంగ్లీష్)- 1.35; చాంగులే బంగారురాజా-4.10,10.10

దేవి	ఖుషి
నటరాజ్	జవాన్(హిందీ)
లలితామహల్	మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి
విజయ్	జవాన్(తెలుగు)